



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

లెండి, నాగమడుగు ప్రాజెక్ట్‌లను పూర్తిచేస్తాం

- బిచ్కుంద-పిట్లం-బాన్సువాడ-గాంధారిరోడ్డుకు రూ.160 కోట్లు మంజూరు
- బిచ్కుంద నుంచి శాంతాపూర్ ఎన్‌హెచ్ వరకు రూ.20కోట్లతో డబుల్‌రోడ్డు
- నియోజకవర్గంలో రూ.20 కోట్లతో మరో 6 సబ్‌స్టేషన్‌లు
- బిచ్కుంద సభలో రాష్ట్రరోడ్డుభవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బిచ్కుంద, జూలై 7 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే అంతర్రాష్ట్ర లెండిప్రాజెక్ట్, నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి జుక్కల్ నియోజకవర్గ రైతాంగానికి సాగునీరందించేందుకు కృషిచేస్తానని రాష్ట్ర రోడ్డుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీఇచ్చారు. జుక్కల్ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం పలు అభివృది కార్యక్రమాలను ప్రారంభించారు. పిట్లం మండలంలోని మద్దెల చెరువు, పిట్లం రోడ్డు, తిమ్మనగర్ వద్ద రూ.4.86 కోట్లతో నూతనంగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా బిచ్కుంద నుంచి డోంగ్లి వరకు రూ.13.20కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి జుక్కల్ నియోజకవర్గానికి పలు హామీల వర్షం కురిపించారు. బిచ్కుంద- పిట్లం- బాన్సువాడ- గాంధారి వరకు నాలుగులైన్ల ప్రధానరహదారి నిర్మాణానికి రూ.160కోట్లు నిధులు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. బిచ్కుంద నుంచి శాంతాపూర్ జాతీయ రహధారి వరకు డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరుచేశారు. బిచ్కుంద పట్టణంలోని భద్రల్ తండాకు సీసీ రోడ్డుకోసం రూ.40లక్షలు మంజూరుచేశారు. పిట్లం, బిచ్కుంద పట్టణాల్లో సెంట్రల్ లైటింగ్ పనులు సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. జుక్కల్ నుంచి మద్నూర్ వరకు ప్రధాన రహధారికోసం రూ.13కోట్లు కేటాయించారు. శాంతాపూర్‌దడ్గి రోడ్డు వరకు రూ.20కోట్లు మంజూరుచేశారు. నియోజకవర్గంలో రూ.20కోట్లతో మరో 6 సబ్‌స్టేషన్‌లు మంజూరు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం, రోడ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే ప్రతిపాదించిన రోడ్లకు ఇన్‌చార్జ్ మినిస్టర్ సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పనులు జరిగేలా కృషిచేస్తానన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జుక్కల్ నియోజకవర్గానికి ఒక డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కూడా నిరుపేదలకు మంజూరుచేయలేదని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేసి నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

• కూలిపోయే ప్రాజెక్ట్‌కు రూ.లక్షల కోట్లు అప్పుచేశారు..

రూ.లక్షల కోట్లు అప్పులు చేసి కూలిపోయే కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాజీ సీఎం కేసీఆర్ కట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్ట్ కుంగిపోయి కూలిపోతున్నా మరమ్మతుల పేరిట కేసీఆర్ కోట్లు దోచుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపడుతుంటే బీఆర్‌ఎస్ (మిగతా 8వపేజీలో..)

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కోసం అనుమతులు
- ఉచితంగా ఇసుకను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్ల చాటున ఇసుక దందా
- అక్రమార్కులకు వరంగా మారిన ఉచిత ఇసుక
- అక్రమ ఇసుక రవాణాకు తెరలేపిన అక్రమార్కులు
- ఇసుక దందాకు స్థానికంగా ఉండే కొందరు నేతలే అండ
- పక్కదారి పడుతున్న ఇసుకపై నిఘా కరువు



అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా!

కామారెడ్డి, జూలై7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంజీరా నదిలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అక్రమరవాణాకు ఇసుకాసురులు, అక్రమార్కులు తెరలేపారు. లబ్ధిదారులు ఇసుక కోసం ఇబ్బందులు పడుతుంటే అక్రమార్కులు అందినకాడికి మంజీరాలో ఇసుకను తవ్వుతూ అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రతీ ఇందిరమ్మ ఇంటికి 10 ట్రాక్టర్ల ఇసుక ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాల రవాణా ఖర్చును మాత్రం లబ్ధిదారులు భరించుకోవాలని సూచించింది. అయితే స్థానికంగా ఉండే కొందరు నేతలు, ఇసుకాసురులు ఇందిరమ్మ ఇళ్ల పేరిట స్థానికంగా ఉండే నదులు, వాగుల్లోంచి ఇసుకను తోడేస్తున్నారు. అనుమతులు లేకున్న సమీపంలోని వాగుల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ ఇసుక డంప్‌ను మళ్లీ ఇందిరమ్మ లబ్ధిదారులు ఇతర పనులకు విక్రయిస్తున్నారు. దీంతో ఇసుక దొరకక అసలైన ఇందిరమ్మ లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ఇందిరమ్మ ఇళ్ల పేరిటే కాకుండా ప్రభుత్వ నిర్మాణ పనులకు మంజీర నది నుంచి పెద్దమొత్తంలోనే ఇసుక తవ్వకాలు ఇస్తున్నారు. ఇలా ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుకను అక్రమరవాణా జోరుగా సాగుతోంది.

మంజీరాతోపాటు వాగుల్లో తవ్వకాలకు అనుమతులు

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉచితంగా ఇసుకను ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 13,653 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మజూరు కాగా ఇందులో 3వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణాల కోసం జిల్లాలో మంజీరా నదితో పాటు మరికొన్ని వాగుల్లో ఇసుక తవ్వకాల కోసం రెవెన్యూ, మైనింగ్ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. లబ్ధిదారులు సమీపంలోని వాగుల నుంచి ఇసుక తెచ్చుకోవడానికి రెవెన్యూ శాఖ అధికారులు వే బిల్లులు జారీ చేస్తున్నారు. ప్రధానంగా బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ పరిధిలో మంజీరా నది ఉండడంతో ఈ నది నుంచి ఇసుక అనుమతులు జారీ అవుతున్నాయి. బిచ్కుంద మండలంలోని పుల్కల్, బీర్కూర్ మండలంలోని చించోలి, బరంఎడిగి, బీర్కూర్ రిచ్‌ల నుంచి లబ్ధిదారులు ఇసుక తీసుకెళ్లడానికి అనుమతి ఉంది. నిత్యం వందలాది ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తున్నారు.



బీర్కూర్, బిచ్కుంద మంజీర నుంచి ఇసుకను తరలిస్తున్న నంబర్ లేని ట్రాక్టర్

అక్రమార్కులకు వరంగా ఉచిత ఇసుక

ఇసుక రవాణాకు స్థానిక తహసీల్దార్లు అనుమతులు జారీచేయాల్సి ఉంటుంది. అయితే ఉచిత ఇసుక అక్రమార్కులు, ఇసుకాసురులకు వరంగా మారింది. లబ్దిదారుల పేరిట పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లలో ఇసుకను మంజీరా నుంచి రవాణాచేసి రహస్య స్థలాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళలో టిప్పర్‌లు,లారీలలో లోడ్ చేసి గుట్టుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది అక్రమార్కులు లబిదారుల పేరిట ట్రాక్టర్‌లో ఇసుక తీసుకువస్తు ప్రైవేట్ వ్యక్తులకు దర్జాగా విక్రయిస్తు జేబులు నింపుకుంటున్నారు. తహసీల్దార్ల నుంచి కొందరు 5 టిప్పర్‌ల అనుమతి తీసుకుని అవే వే బిల్లులపై 10 ట్రాక్టర్ల ఇసుక రవాణా చేస్తున్నారు. లబ్ధిదారుల ఇంటి వద్ద సగం పోసి మిగితా సగాన్ని ఇతరులకు విక్రయించుకుంటున్నారు. ఇసుకను తరలించే ట్రాక్టర్‌లలో కొన్నింటికి నంబర్ ప్లేట్లు కూడా ఉండడంలేదు. ఇలా ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.2 వేల నుంచి 4 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నిఘా కరువు

ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరాఫరా చేస్తుండడంతో ఇదే అదునుగా భావిస్తున్న స్థానికంగా ఉండే కొందరు నాయకులు, ఇసుకాసురులు తమ పలుకుబడిని ఉపయోగించి రెవెన్యూ వద్ద లబ్ధిదారుల పేరిట వే బిల్లులు పొందుతూ అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కులు మంజీరా వాగులోని రిచ్‌లోంచి ఇసుక తీసుకువెళ్తున్నారు. ఈ ఇసుక ఎటు వెళ్తోంది అనేది అధికారుల పర్యవేక్షణ లేకుండాపోతోంది. అక్కడక్కడ కొందరు పోలీసులు ఇసుకట్రాక్టర్‌లను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అధికారులు రెవెన్యూ సదస్సుల నిర్వహణలో బీజీగా ఉండడంతో ఇసుక తరలింపుపై నిఘా కరువవడంతో పక్కదారి పడుతోంది.



నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలో నాట్లు వేసి నిరసన

కామారెడ్డిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీ ప్రధానరహదారిపై ఏర్పడిన గుంతలలో కాలనీవాసులు సోమవారం నాట్లు వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని గుంతలతో చాలా ఇబ్బందిగా మారుతుందని అధికారులకు విన్నవించిన కనీస స్పందన లేదని తెలిపారు. జిల్లా అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే ఈ రోడ్డు నుంచే ప్రయాణాలుచేస్తున్న రోడ్డును బాగుచేసే విషయంలో మాత్రం అధికారులు స్పందించడం లేదని తెలిపారు. చేసేదేమీ లేక తమ నిరసనను నాట్లువేసి తెలుపాల్సి వస్తోందని అన్నారు. అధికారులు స్పందించి రోడ్డు తోపాటు డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అర్కల ప్రభాకర్ యాదవ్, జగదీష్ యాదవ్, లోలపు శ్రీనివాస్, గంగారాం యాదవ్, దినేష్‌రెడ్డి, నరేందర్,రాజేష్, శ్రీనివాస్, దేవదాస్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేద్దాం

సదాశివనగర్, జూలై7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించబోయే వన మహోత్సవ కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా కృషిచేసి విజయవంతం చేద్దామని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రం శివారులో మొక్కలు నాటే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధిహామీ సిబ్బంది ద్వారా గుంతలు తీసే కార్యక్రమాన్ని పరిశీలించారు. గతంలో నాటిన హరితహారం మొక్కలను సంరక్షిస్తూ ఈ సంవత్సరం పెద్దఎత్తున మొక్కలు నాటుకుందామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

బోనాల పండుగకు రావాలని షబ్బీర్ అలీకి ఆహ్వానం

దోమకొండ, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఈనెల 13న నిర్వహించే బోనాల పండుగకు హాజరుకావాలని కోరుతూ సోమవారం ఆలయకమిటీ ప్రతినిధులు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో పెద్దఎత్తున జరిగే ఈ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి, మాజీ జడ్పీటీసీ తిరుమల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారామ మధు, కాంగ్రెస్ నాయకులు శంకర్‌రెడ్డి, నల్లపు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, ఈవో ప్రభు, ఆలయ కమిటీ ధర్మకర్తలు ఎల్లంయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్‌కు ఆర్టీసీ బస్సులు కరువు!

- 34 ఏళ్లుగా ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇదీ నిజాంసాగర్ రవాణా సౌకర్యాల తీరు

7

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- ఏళ్లు గడుస్తున్నా.. సొంత భవనాలు లేక ఇక్కట్లు
- ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్

కామారెడ్డిటౌన్, జూలై7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆర్‌డీవో వీణతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 107 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి శనివారం లోగా దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి ప్రజావాణిలో వినతి అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాల నుండి విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్ ప్రభుత్వాలు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల చదువు పూరైన తర్వాత పైచదువులకు వెళ్లాలంటే టీసీ, మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్స్ అవసరం ఉంటాయని ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయని తెలిపారు. 2005 విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకుండా ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలు అనధికారికంగా ఫీజులు వసూలుచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు రాందాస్, జిల్లా నాయకులు సాయికుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చందర్‌నాయక్



వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అన్నంలో పురుగులు వస్తున్నాయని రోడ్డుపై విద్యార్థుల ఆందోళన

ఎల్లారెడ్డి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అన్నంలో పురుగులు వస్తున్నాయని కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పురుగులతో ఉన్న అన్నాన్ని తినలేకపోతున్నామని, సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. విషయం స్థానిక తహసీల్దార్ ప్రేమ్ కుమార్ విద్యార్థులతో మాట్లాడి పాఠశాలను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ విక్టర్ సైతం పాఠశాలకు చేరుకుని అక్కడి వంటకాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి డైనింగ్ హాల్, స్టాక్ రూమ్, కిచెన్ రూమ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు. సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని విద్యార్థునీలకు సద్దిచెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఏంఈఓ రాజులు, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, ఆర్‌సీవో గంగారాం నాయక్ , ఏఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్

వెలవెలబోతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు

- వర్షాల్లేక ప్రాజెక్టులోకి రాని నీరు
- ప్రశ్నార్థకంగా ఆయకట్టు రైతుల భవితవ్యం
- వానాకాలం ప్రణాళిక ఖరారుచేయని అధికార యంత్రాంగం

నిజాంసాగర్, జూలై7 (ఆంధ్రజ్యోతి): లక్షల ఎకరాలకు సాగు నీరందించిన నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వలు లేక బోసిపోతోంది. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఏ ఒక్కరోజు కూడా భారీ వర్షాలు కురియక పోవడంతో ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతం నుంచి భారీ వరద నీరు కానరాక పోయింది. దీంతో ప్రాజెక్టు నమ్ముకున్న ఉభయ జిల్లాల రైతాంగం వానాకాలం సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రతీఏటా వర్షాకాలంలో కురిసే వర్షాలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతూ వచ్చేది. కానీ ఈ ఏడాది వర్షాకాలం నెల గడుస్తున్నా భారీ వర్షాలు కురవలేదు. అడపాదడపా కురిసే వర్షాలకు ఆయకట్టు కింద రైతులు వరి నారుమళ్లు వేసుకొని నాట్లువేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వర్షాలు కురియక రైతులు వరినాట్లు వేయక వరుణుని కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు లేని కారణంగా ఏడాది నీటిపారుదల శాఖ అధికారులు వర్షాకాలం ప్రణాళిక ఖరారు చేయలేకపోయారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర రాజధానిలోని శివం కమిటీ సమావేశం నిర్వహించి ఆయకట్టును ఖరారుచేసేవారు ప్రాజెక్టులు జూన్ మాసంలో నిండకపోవడంతో ఇప్పటికీ ప్రాజెక్టుల వర్షాకాల ప్రణాళికను ఖరారు చేయలేక పోయారు. గత సంవత్సరం జూలై, ఆగస్టు మాసంలోనే కురిసిన భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంలో నీటినిల్వలు పెరిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే భారీ వరదనీటిని దిగువ మంజీరాకు 74 టీఎంసీల నీటిని వదిలివేశారు. వర్షాకాలం సాగుకు ప్రాజెక్టు నుంచి ఎలాంటి సాగు నీటిని విడుదల చేయలేదు. గత ఏడాది కురిసిన వర్షాలకు సంగీతం, కళ్యాణి రిజర్వాయర్ల ద్వారా వచ్చే వరద నీటిని నిజాంసాగర్ ప్రధాన కాల్వ లోనికి మళ్ళించి నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను గట్టి ఎక్కించారు. యాసంగి సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టులో 17 టీఎంసీల నీటి నిల్వ ఉండగా నీటిపారుదల శాఖ అధికారులు యాసంగికి లక్షా 35వేల ఎకరాలకు సాగునీరు అందించారు. యాసంగి సాగు అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆరు టీఎంసీల నీరు నిల్వ ఉండగా జూన్ 18 నుంచి బోధన్

(మిగతా 8వపేజీలో..)



29 నుంచి 17 టీఎంసీలకే పరిమితం

నిజాంసాగర్ ప్రాజెక్టు నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలకు వరప్రదాయని. ఈ ప్రాజెక్టు అప్పట్లో 29 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ నీటితో 2లక్షల 75 వేల హెక్టార్లకు సాగునీరు అందించేవారు. క్రమంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే భారీ వరద నీటితో పాటు ఇసుకమెట్ట వచ్చి నిజాంసాగర్ ప్రాజెక్టులో పేరుకుపోయింది. దీంతో ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 17 టీఎంసీలకే పరిమితమైంది.



పూజలు చేస్తున్న భక్తులు

సిద్ధరామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

భిక్కనూరు,జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా మెదక్ జిల్లా నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో

ఆర్మూర్‌రూరల్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. సోమవారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో బూత్‌స్థాయి అధికారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరి పేరును ఓటర్ జాబితాలో నమోదు చేయాలన్నారు. అదే విధంగా మృతి చెందిన వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించాలని, ఇతర ప్రాంతాల్లో వెళ్లి నివసిస్తున్న వారి పేర్లు తొలగించి వారు నివాసం ఉన్నచోటనే ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఒకే వ్యక్తికి రెండుచోట్ల ఓటు ఉండకుండా చూడాల్సిన బాధ్యత బూత్‌స్థాయి అధికారులపై ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో రాజగంగారాం, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిరుత సంచరించిన ప్రాంతాల పరిశీలన



మిట్టాపూర్‌లో చిరుత సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని సోమవారం అటవీశాఖ బీట్ ఆఫీసర్లు సుధీర్, రాజేందర్‌లు పరిశీలించారు. ఆదివారం సాయంత్రం మిట్టాపూర్ శివారులో మేకల మందపై చిరుత పులి దాడి చేసి ఒక మేకను తీవ్రంగా గాయపర్చిన విషయం విదితమే. చిరుత పులి సంచారంపై వారు గ్రామస్థుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిరుత పులి సంచారం పట్ల మేకల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని బీట్ ఆఫీసర్లు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్,జూలై7(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మంగళవారం అభివృద్ధి పనులలో భాగంగా సబ్ స్టేషన్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని టౌన్ ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, దుర్గానగర్, కొత్తబస్టాండ్, సరస్వతి నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి రెండు రోజుల జైలు

రెంజల్,జూలై7(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడపడంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష న్యాయమూర్తి విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మద్యం తాగిన వారిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించారన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయని, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

అంగన్‌వాడీలను పటిష్ఠం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్

బోధన్‌రూరల్,జూలై7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను పటిష్టం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. సోమవారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్నా రవి, సీనియర్ నాయకులు అల్లె రమేష్, తమ్మి శంకర్, ఈరాయప్ప శివ కుమార్, అశోక్, మాధవరావు, పీరాజీ, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సుదర్శన్, గ్రామపెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్లు వ్యాన్ బోల్తా

- ముగ్గురికి గాయాలు

నవీపేట,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ శివారులో సోమవారం ఉదయం కల్లు వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వ్యాన్ టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడగా వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయని స్థానికులు వివరించారు. వెంటనే బాధితులను మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కల్లు సీసాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ విషయంపై ఎస్‌ఐ వినయ్‌ని వివరణ కోరగా ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.



యంచలో బోల్తా పడిన కల్లు వ్యాన్

హత్య కేసులో తల్లీ కొడుకు రిమాండ్

బోధన్‌రూరల్,జూలై7(ఆంధ్రజ్యోతి):బోధన్ మండలం మిరాన్‌పల్లి గ్రామంలో దారావత్ దేశ్యానాయక్ హత్యకు గురి కాగా దారుణహత్యకు పాల్పడిన భార్య సాలుబాయిని, కొడుకు వసంత్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మినార్‌పల్లి గ్రామంలో దారావత్ దేశ్యానాయక్‌ను దారుణంగా హత్య చేసిన అతని భార్య, కొడుకును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.పూర్తి విచారణ అనంతరం తల్లితో పాటు తనయుడిని సైతం విచారించగా అసలు విషయాలు బయటకు వచ్చాయని ఆయన వెల్లడించారు. సోమవారం సాయంత్రం కోర్టుకు రిమాండ్ చేశామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

వేల్పూర్ , జూలై,7 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం లక్కోర గ్రామ శివారులో సోమవారం ఉదయం సుమారు ఐదు గంటల సమయంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తి జీన్‌ప్యాంట్, బ్లూ షర్టు, రెడ్ బనియన్ ధరించి ఉన్నాడు. మృతుడి తల తెగి పడడంతో వ్యక్తి ఎవరు అనేది స్థానికులు గుర్తు పట్టలేకపోతున్నట్లు తెలిసింది.

కేటీఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

- రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

వేల్పూర్ , జూలై,7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 18 నెలల్లో నుంచి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కేటీఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం వేల్పూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత పది సంవత్సరాలలో బీఆర్‌ఎస్ హయాంలో జరగలేని అభివృద్ధి పనులు పద్దెనిమిది నెలల్లోనే కొనసాగుతున్నాయని ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. పద్దెనిమిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేస్తుందో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ మాట్లాడడం హస్యస్పదంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఉంటు డ్రగ్స్ వ్యవహారంలో ఉండే కేటీఆర్‌కు గ్రామాల్లో జరిగే అభివృద్ధి ఏమి తెలియదని గ్రామాలలో తిరుగుతు ప్రజలను తెలుసుకోవాలే తప్ప, బుద్ధి జ్ఞానం ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి పై అసత్యపు, తప్పుడు మాటలు మాట్లాడడం మానుకోవాలని లేదంటే ఊరుకునేది లేదని మానాల హెచ్చరించారు. గతటీఆర్‌ఎస్ పాలనలో ఎక్కడ కూడా పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదన్నారు. ఎన్నికల కంటే ముందు రేవంత్‌రెడ్డి ప్రతీ నియోజకవర్గంలో పాదయాత్ర చేసినప్పుడు ఇళ్లు లేని పేదల బాధలు ఆయన విన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతీ నియోజకవర్గంలో మూడువేల ఐదు వందలు ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. వేల్పూర్ మండలానికి సుమారు నాలుగువందలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. పేదలకు తమకు సొంత ఇళ్లు ఉండాలన్న కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఇళ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తు నిర్మాణ పనుల్లో వేగవంతం అయ్యే విధంగా అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటి సభ్యులు తమ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా లబ్ధిదారు లకు అన్నివిధాల సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజల కోసం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయం కేటాయిస్తు వారికి దగ్గరవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసే ప్రక్రియలో ఎక్కడ కూడా పార్టీ విభేదాలు, తమ, మన బేదాలు చూడాకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకే ఇవ్వడం జరిగిందన్నారు. గత పదేళ్ల క్రితం, అలాగే ప్రస్తుతం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ నరేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దామోదర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేష్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటి సభ్యులురమణ,రాజేందర్,కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించిన విద్యార్థినులకు సన్మానం

వేల్పూర్: వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించిన సహస్ర, స్వాతికలను సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి శాలువతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు చదువులో భాగ రాణిస్తు మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఆ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూమారెడ్డి, కనక రవి, రమేష్, నరేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

మోస్రా,జూలై7(ఆంధ్రజ్యోతి): మోస్రా తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే మోస్రా గ్రామ శివారులోని సర్వే నంబర్ 952 ఫారెస్ట్ భూముల వివరాల కోసం రికార్డులను పరిశీలించారు. ఈ రికార్డుల ప్రకారం తహసీల్దార్‌తో వివరాలు తెలుసుకుని ఆ తర్వాత ఆ భూమి మొఖాపైకి వెళ్లి పరిశీలించాలని.. అలాగే భూ సమస్యలను పరిష్కారం చేసేందుకు పని చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఏ ఫైనల్ ఫలితాల్లో మచ్చర్ల గ్రామ యువకుడి అత్యుత్తమ ప్రతిభ

మెండోర , జూలై,7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా వారు విడుదల చేసిన సీఏ ఫైనల్ ఫలితాల్లో మెండోర గ్రామానికి చెందిన రైతు మచ్చర్ల రాజారెడ్డి కొడుకు రాజేందర్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా సీఏ రాజేందర్ రెడ్డి పదోతరగతి వరకు నిజామాబాద్ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. రాజేందర్‌రెడ్డి సీఏఫైనల్ ఉత్తీర్ణత సాధించడంపట్ల తల్లిదండ్రులు,బంధువులు, పలువురు, స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.



ఎమ్మార్పీఎస్ పతకాన్ని ఆవిష్కరించిన దృశ్యం



మెండోరాలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఆర్మూర్‌టౌన్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు 31వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నియోజకవర్గ ఇన్‌చార్జి షైలారం బాలు ఎమ్మార్పీఎస్ పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ మాదిగల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ సాధించడంతో పాటు ఆరోగ్యశ్రీ, వికలాంగుల, వితంతువుల వృద్ధుల పెన్షన్ల పెంపుకోసం ఎమ్మార్పీ ఎస్ క్రియాల శీలక పాత్ర పోషించిందని 31 ఏళ్లుగా ప్రజా సమస్యల మీద ప్రభుత్వాలతో పోరాటం చేసి ఫలితాలను సాధించిందని అన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయడానికి ఎమ్మార్పీఎస్ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందక్రిష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శ్యాం మాదిగ, సీనియర్ నాయ కులు ఇందరపు రాజు, మండల అధ్యక్షుడు రాము, సంతోష్, మంగళారం రవి, సంకెపల్లి విప్లవ్, కొక్కెర భూమన్న, రింగుల భూషన్, తెడ్డు నర్సయ్య, మల్కన్న, నల్ల రాజరాం, కృష్ణయ్య, పొన్నాల చంద్రశేఖర్, గణేష్, సుదర్శన్, రాజన్న, స్వామి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: బడుగు బలహీన వర్గాలకు అండగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పనిచేస్తుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మకురి మహేష్ మాదిత, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గుంటి నిశాంత్ మాదగలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాదిగ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మాదగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్న రిజర్వేషన్లను పంచుకోవ డమే కాకుండా రిజర్వేషన్లను పెంచుకోవడానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా భారత దేశంలో అన్ని రాష్ట్రాలలో ఎమ్మార్పీఎస్ ఏర్పాటు అయింది. దీనికంత కృషి చేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ వార్డు గ్రహిత మంద కృష్ణ మాదిగకే దక్కుతందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైటప్:08బిఎస్‌పీ07: విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వసతి గృహంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. విద్యార్థులకు శీతల పానీయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం, భవాని లయన్స్ క్లబ్ సభ్యులు బర్ల మధు, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, సంజీవ్, నరేందర్ పాల్గొన్నారు.

మోస్రా: చందూరు మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆదేశాల మేరకు జెండా దిమ్మలు నిర్మించి జెండా విష్కరణ చేయడం జరిగిందని చందూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దాకడి సాయిలు తెలిపారు. ఈ ఒక ఉద్యమం సుదీర్ఘ పోరాటం కొనసాగింది. జాతీయ నాయకుడు మందకృష్ణ మాదిగ కృషి పట్టుదల 30సంవత్సరాల పోరాట ఫలితమే ఈ ఎస్సీ వర్గీకరణ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సాయిలు, గ్రామ శాఖ అధ్యక్షుడు మోస్రా గంగారాం, ఆయా గ్రామాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎర్రోళ్ల యాదవ రావు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్‌ను స్థాపించడంతో పాటు 30సంవత్సరాల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బడుగు, బలహీన వర్గాల కోసం ఆరోగ్యశ్రీ, వికలాంగుల పింఛన్ ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా సాధించడం జరిగిందన్నారు. కోటగిరి మండల కేంద్రంలోనూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం, శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, నాయకులు పత్తి లక్ష్మణ్, బర్ల మధు,దావులయ్య, నితిన్, దినేష్, తరుణ్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శక్కర్‌నగర్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రం దళిత రత్న అవార్డు గ్రహీత మందుగుల విద్యాసాగర్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరావు, నాయకులు వీరపురం పోశెట్టి, సురేష్, మహేందర్, జేఏసీ శంకర్, కొత్తపల్లి రవీందర్, బండారి యాదగిరి, సాయిలు, మహేష్, మైనారిటీ రాష్ట్ర నాయకులు రజాక్, మేడి పాపన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.

- సాలూరలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సాలూర మండల కేంద్రంలో సోమవారం దండోరా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మాట్లాడుతూ గత 31సంవత్సరాల చరిత్రలో శాంతియుతంగా కొనసాగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు అల్లె రమేష్, శ్రీకాంత్ పటేల్, నాగరాజు, వెంకట్ పటేల్, ప్రజ్ఞశ్రీ రాజు, ముత్యం, ప్రకాష్, లింబూరి లక్ష్మణ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్, సతీష్, జీవన్, చింతల సాయన్న, శేఖర్, రాములు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కృషిన మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమ ప్రస్థానం ప్రారంభమై 31సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను కొలతల ప్రకారం నిర్మించాలి

వర్ని, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ళను నిర్దేశించిన కొలతల ప్రకారం నిర్మించాలని వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్లు స్పష్టంచేశారు. సోమ వారం వర్ని మండలం మల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను ఆయన పరిశీలించారు.ప్రతి లబ్ధిదారుకు తక్షణమే బిల్లు మంజూరు కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరార

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

రుద్రూరు,జూలై7(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు ఆధ్వర్యంలో సోమవారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ చేతుల మీదుగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి గాండ్ల మధు, దౌడ్ సాయిలు, నీరడి సాయిలు, ఆర్.పోశెట్టి, సాయాగౌడ్, శ్రావణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమావేశం

పెర్కిట్ , జూలై,7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం కాంప్లెక్స్ హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యశాఖ అధికారి ఆదేశానుసారం కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఈ విద్యాసంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, విద్యాపరమైన కార్యక్ర మాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాలు శ్రీనివాస్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పంచాయతీ అనుమతి లేని ప్లాట్లు కొనొద్దు

ముప్కాల్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ గ్రామ పంచాయితీ అనుమతి లేని ప్లాట్లు కొనుగోలు చేయవద్దని కొత్తపల్లి గ్రామ పంచాయితీ సెక్రటరీ రాజు సోమవారం సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. అనుమతులు లేకుండా వెంచర్‌లో ప్లాట్లు అమ్మకానికి పెట్టి రాజు సామాన్య ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.పంచాయితీకి ఎలాంటి సంబంధం లేదని ప్లాట్లు అమ్మిన, కొన్నవారిపై చట్టపరమైన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

కొడిచర్ల శివారులో ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,జూలై7(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున కొడిచర్ల మంజీర తీరం నుండి ఇసుకను ట్రాక్టర్లలో నింపి అక్రమంగా తరలిస్తు న్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత యాజమానులపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఎల్‌ఓ మీటింగ్ వాయిదా వేయాలి

రుద్రూరు,జూలై7(ఆంధ్రజ్యోతి): బీఎల్‌ఓలకు ట్రైనింగ్ మీటింగ్ జూలై 9న కాకుండా మరుసటి రోజు నిర్వహించాలని బూత్ లెవెల్ ఆఫీసర్‌లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రుద్రూరు డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఉన్నందున సమ్మెలో పాల్గొననున్నట్లు నెల రోజుల క్రితం సంబంధిత అధికారికి సమ్మె నోటీసు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్, బీఎల్‌ఓలు పద్మ, ప్రతిమ, గంగామణి, రూప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హాసాకొత్తూర్‌లో ఉచిత వైద్య శిబిరం

కమ్మర్‌పల్లి,జూలై,7(ఆంధ్రజ్యోతి):చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని హాసాకొత్తూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఏఎన్‌ఎంలుమమత, అమృత, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవతిగంగాధర్, నాయకులు,ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రెంజల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యార్థులకు కీటక జనిత వ్యాధులు, పరిసరాల శుభ్రతపై ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్ కుమార్, రవీందర్‌లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ ప్రత్యేక అధికారి శ్యామల, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ఆర్మూర్ టౌన్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 14, 35 వార్డులలో సోమవారం మున్సిపల్ అధికారులు మహిళలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు.ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడవద్దని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, సానిటరీఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్లు శివకుమార్, నర్సయ్య, సానిటరీజవాన్లు, మెప్మాఆర్పీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జక్రాన్‌పల్లి , జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో వలస వచ్చి నివాసం ఉంటున్న లింగంపేట గ్రామానికి చెందిన కోరబోయిన అశోక్(32) అదృశ్యం కాగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు పోలీస్‌లు తెలిపారు. కోరబోయిన అశోక్ గతనెల 28న రాత్రి 9 గంటలకు జక్రాన్‌పల్లిలోని తన స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని చెప్పి బైక్ పై వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పోలీస్‌లు తెలిపారు. అదే రోజు అశోక్ అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు. బైక్‌పై అర్గుల్ నుంచి డిచ్‌పల్లి వెళ్తుండా జక్రాన్‌పల్లి 44వ జాతీయ రహదారిపై బైక్ పై నుంచి కింద పడగా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం కోరబోయిన అశోక్ మృతిచెందినట్లు పోలీస్‌లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప్లూర్‌లో సోయా పంట పరిశీలన

కమ్మర్‌పల్లి,జూలై 7 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ తదితర గ్రామాలలో ఇటీవల గడ్డి మందు చల్లడంతో మాడిపోయిన సోయా పంటను జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మర్‌పల్లిలోని ఎరువుల డీలర్ భూమేశ్వర్ దుకాణం నుంచి గడ్డి మందును కొనుగోలు చేసినట్లు ఆయన నిర్ధారించారు. ఈ మేరకు డీలర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. కాలం చెల్లిన క్రిమి సంహారక మందులను (కల్తీ మందులు) సీజ్ చేసి అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. కాగా శాంపిళ్లను సేకరించి టెస్టింగ్ నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంటల పరిశీలనలో బాధిత రైతులతో పాటు మండల వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ, ఏఈవో రమేష్ ఉన్నారు.

'ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మాణాన్ని తొలగించాం'

ఎల్లారెడ్డిరూరల్, జూలై 07(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఓ ఇంటి నిర్మాణాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకే తొలగించామని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, మాల్కాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మారెడ్డితండాకు చెందిన కోల రాములునాయక్ ఆల్ ఇండియా బంజార సేవా సంఘం నూతన కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన



పాఠశాలలో షీటీం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెర్కిట్ , జూలై,7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో సోమవారం సైబర్ క్రైం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షీ టీం విఘ్నేష్, సుమతి విద్యార్థిని విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపైఅవగాహన కల్పిస్తు సోషల్ మీడియాలో గల ఇన్‌స్టాగ్రాం, ఫేస్ బుక్ వంటి వాటిని వాడకూడదని పలు ఉదహరణలతో వివరించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.


సోయా పంటలో పిచ్చి మొక్కలు అరకతో తొలగిస్తున్న రైతులు

వ్యవసాయంలో రైతన్నల బిజీ బిజీ

● వర్షంతో ఊరట ● సోయా, పత్తి పంటలకు జీవం

మద్నూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో అన్నదాతలు బిజీబిజీగా తమ పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత నెల రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరట కలిగించగా పంటలకు ఊపిరి పోసినట్లయింది. ఉమ్మడి మద్నూర్ మండలంలో రైతులు సాగుచేసిన సోయా, పత్తి, కందులు, మినుములు, పెసర, తదితర వాణిజ్య పంటలకు జీవం పోసినట్లయింది. గత కొద్దిరోజులుగా వర్షాలు కురియక ఎండలు మండిపోవడంతో తొలకరి వర్షాలు పులకరించి విత్తిన పత్తి, సోయా విత్తనాలు మొలకెత్తుతాయో లేదోనని కొంతమంది రైతులు మొలకెత్తిన వాణిజ్య పంటల మొక్కలు వాడిపోతాయేమో అని రైతులు ఆందోళన చెందారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షపు జల్లులు ఒక మోస్తారు వర్షాలు, గత మూడు రోజులుగా కురుస్తుండడంతో రైతులకు పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. మొలకెత్తిన వివిధ రకాల పంటల మొక్కలకు వర్షాలు ఊపిరి పోయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ మొదటి వారంతో వర్షాలు కురయగా దుక్కులు దున్ని విత్తనాలు విత్తుకునే పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. తదుపరి వరుణుడు ముఖం చాటేయడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తుతాయో లేదోనని మొలకెత్తిన మొక్కలు ఎండిపోతాయేమోనని ఆందోళన చెందుతున్న తరుణంలో వర్షం కురుస్తుండడంతో ఈసారి పత్తి, సోయా తదితర పంటలు గట్టెక్కుతాయని రైతులు భావిస్తున్నారు. ఈసారి ఉమ్మడి మద్నూర్ మండలంలో సోయా 35 వేల ఎకరాలు, పత్తి నాలుగు వేల ఎకరాలు, కందులు 5,200 ఎకరాలు, మినుములు 1550 ఎకరాలు, పెసర్లు 1250 ఎకరాలు, వరి 6,200 ఎకరాలలో రైతులు పంటల సాగు చేశారు. అన్నదాతలు ఎన్నో ఆశలతో వేసిన పంటలు ఈసారి అధిక దిగుబడి వస్తాయని ఆశిస్తున్నారు.

రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలి


నవీపేటలో ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాసర ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం నవీపేటలోని బాసర ప్రధాన రహదారికి చెందిన ఇరువైపులా ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా అక్రమంగా షెడ్లు వేయడంతో రోడ్డుపై వాహనాలు నిలుపుతున్నారని దీంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల మండల కేంద్రంలోని బాసర ప్రధాన రహదారిపై తేజశ్విని అనే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్థానిక యువకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినయ్, ఈడీఏఆర్ జిల్లా మేనేజర్ వర్షనిహంత్, ఆర్అండ్‌బీ డీఈ రామ్మోహన్, ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులున్నారు.

ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చివేయాలి


ఫకీరాబాద్ వద్ద ప్రధాన రహదారిపై గుంతలు పడిన దృశ్యం

నవీపేట,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చివేయాలని స్థానికులు కోరారు. బాసర ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని రహదారిపై భారీ సైజులో గుంతలు పడడంతో రాత్రివేళలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు పేర్కొన్నారు.

ఫోకస్


నిజాంసాగర్ బస్ స్టేషన్ ఇదే


సంగారెడ్డి - హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు పిట్లం ఎక్స్ రోడ్డు వద్ద వేచి ఉన్న దృశ్యం


నరసింగరావుపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నిజాంసాగర్ వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

నిజాంసాగర్‌కు ఆర్టీసీ బస్సులు కరువు

● 34 ఏళ్లుగా ప్రయాణికులకు తప్పని తిప్పలు
● పట్టించుకోని పాలకులు, అధికారులు
● ఇదీ నిజాంసాగర్ రవాణా సౌకర్యాల తీరు

నిజాంసాగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే చందంగా మారింది నిజాంసాగర్ రవాణా సౌకర్యం తీరు. ఎన్నికలు వచ్చాయంటే చాలు ఎన్నికల బరిలో నిలుచున్న అభ్యర్థులు వాగ్దానాలు హామీలు ఇస్తారే తప్ప ఎన్నికలు పూర్తి అయ్యాక నిజాంసాగర్ రవాణా సౌకర్యం గురించి మర్చిపోవడం ప్రజాప్రతినిధుల ఆనవాయితీ. ఆనాడు రాష్ట్ర రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ నిజాంసాగర్‌కు కాలక్రమేనా రవాణా సౌకర్యం ప్రజలకు లేకుండా పోయింది. సంగారెడ్డి, హైదరాబాద్, నారాయణఖేడ్, జోగిపేటలతో పాటు మహారాష్ట్ర కర్ణాటక ప్రాంతాలకు నిజాంసాగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేకపోవడంతో అనేక పాట్లు పడుతూ ఒకటి రెండు చోట్ల బస్సులను మార్చుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. 34 ఏళ్లుగా ఈ పరిస్థితి ప్రయాణికులు ఎదుర్కొంటున్న పాలకులు అధికారులు పట్టించుకునే పాపాన పోవడం లేదని మండల వాసులతో పాటు నిజాంసాగర్ బస్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు. నిజాంసాగర్ నుంచి సంగారెడ్డి హైదరాబాద్ వెళ్లాలనుకుంటే నర్సింగరావుపల్లి కూడలి అయిన పిట్లం చౌరస్తాకు వెళ్లి హైదరాబాద్ సంగారెడ్డి జోగిపేట్‌లకు వెళ్లాల్సి వస్తోంది. నిజాంసాగర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు వెళ్లాలంటే సంగారెడ్డి హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు నరసింగరావు పల్లి చౌరస్తాలో బస్సు దిగి ఆటోలు కోసం పడిగాపులు కాస్తూ నిజాంసాగర్‌కు వెళ్లాల్సి వస్తోంది. నిజాంసాగర్ నుంచి నారాయణఖేడ్ బీదర్ ప్రాంతాలకు వెళ్లాలంటే ఒకటి రెండు మూడు బస్సులు తప్ప వేరే డిపోల బస్సులు ఈ ప్రాంతానికి నిజాంసాగర్ నుంచి వెళ్లాలంటే అనేక పాట్లు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. నిజాంసాగర్ నుంచి జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ ప్రాంతాలకు వెళ్లా లంటే ఇక్కడి ప్రయాణికులు పిట్లం కూడలికి వెళ్లాల్సి వస్తోంది. గతంలో మెదక్, హైదరాబాద్ 2, హైదరాబాద్ 1, సంగారెడ్డి ప్రజ్ఞాపూర్ డిపోలకు చెందిన బస్సులు నిజాంసాగర్ కూడలిని మీదుగానే వెళుతూ ఉండేవి ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కొందరు అధికారులు తప్పుడు నివేదికలు అందజేయడంతో ఈ డిపోల బస్సులను నిజాం సాగర్‌కు రాకుండా రద్దు చేశారు. పిట్లం కూడలి నుంచి రెండు వరుసల రహదారి చూడముచ్చటగా ఉన్నప్పటికీ బస్సులు నడపకపోవడం పట్ల పలువురు ప్రయాణికులు నిరసన వ్యక్తం చేస్తూ ఉన్నారు. ఈ బస్సుల కోసం ప్రయాణికులు ప్రజలు పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యం. ఈ ప్రాంతాలకు నిజాం సాగర్ బస్ స్టేషన్ నుంచి ప్రతిరోజు దాదాపు 1500 మంది ప్రయాణికులు వెళుతూ ఉన్న ఆర్టీసీ అధికారులకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరి స్తున్నారని ఆరోపణలు వినవస్తూ ఉన్నాయి. బాన్సువాడ డిపో అధికారులు గతంలో నిజాంసాగర్ ప్రాజెక్టు మీదుగా అచ్చంపేట, ఆరేపల్లి, బ్రాహ్మణపల్లి, మాసంపల్లి మీదుగా శంకరంపేట నారాయణ ఖేడ్‌లకు బస్సులు నడిపేవారు. కాలక్రమేనా ఐదేళ్ల కిందట ఆర్టీసీ అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం ఈ బస్సులను రద్దు చేశారు. నారాయణ ఖేడ్ డిపో నుంచి ఐదేళ్ల కిందట వేములవాడకు బస్సు సౌకర్యం ఉండేది. ఈ బస్సు సౌకర్యాన్ని కామారెడ్డి వేములవాడ డిపో అధికారులు నారాయణఖేడ్ డిపో బస్సులను వేములవాడకు నడపొద్దని ఆంక్షలు విధించడంతో నారాయణఖేడ్ డిపో అధికారులు బస్సులు రద్దు చేశారు. ప్రయాణికులకు అన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించడంతో పాటు పల్లె వెలుగు బస్సులను నడుపుతామని ఆర్టీసీ ఉన్నతాధికారులు సమావేశాల్లో చెబుతూ ఉంటారే తప్ప చెప్పిన మాటలను ఆచరణలోనికి పెట్టలేకపోతున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తూ ఉన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రాష్ట్ర రాజధాని లోని ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న నిజాంసాగర్ కూడలి నుంచి సంగారెడ్డి, హైదరాబాద్, నాందేడ్, వేములవాడ, బీదర్, నాందేడ్ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సోయా.. గయా!

● వైరస్ సోకిన సోయాపంట
● పంట ఆరంభంలోనే పట్టి పీడిస్తున్న వైరస్
● పత్తాలేని వ్యవసాయ అధికారులు

మెండోర , జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధరలేక ఒక వైపు ఈ ఏడాది వర్షాభావ ఏని కారణంతో అన్న దాతలు ఇబ్బందులు ఎదుర్కోవడం ఇంకో వైపు విత్తనం విత్తిన పంటలు మొలక దశలో ఉన్నప్పటికీ చీడ పీడకు అధికంగా సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా భారీ వర్షాలు లేక అన్నదాతలు కుదేలు అవుతున్న పరిస్థితులు ఉండగా చీడ పీడల భారి నుంచి పంటలను రక్షించి అన్నదాతలు అండగా నిలవాల్సిన వ్యవసాయ అధికారులు పట్టలేకుండా పోయారు. నిజామాబాద్ జిల్లాకు చివర మండలం మెండోర మండలం కావడంతో సంబంధిత అధికారులు ఇటువైపు చూడరు. ఇటువైపు రారు అని రైతులపై వ్యవసాయ అధికారులు చిన్న చూపు చూస్తున్నారని రైతులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోయా పంటకు వైరస్ సోకడంతో వ్యవ సాయ అధికారులు వచ్చి రైతులకు అవగాహన కల్పించి ఏది పిచికారి చేస్తే గట్టెకుతారో చెప్పాలని స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అధికారులకు సమాచారం ఇచ్చిన కాని వ్యవసాయ అధికారులు పంటల వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు రైతులు అంటు న్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లోనే అన్నదాతలకు వ్యవసాయ అధికారుల నుంచి సలహాలు, సూచనలు అవసరం అవుతాయి. అలాంటిది అధికారులు ఎక్కడ కూడా పంటల ను పరిశీలించి సూచనలు ఇచ్చిన పాపాన పోలేదు. సోయా, మొక్క జొన్న, పసుపు పంటలకు వచ్చిన సమస్యల గురించి అధికారులకు విన్నవించుకుందామని రైతు వేదికల దగ్గరికి రైతులు వెళితే ఎప్పుడూ చూసిన రైతు వేదికల తాళాలు దర్శ నమిస్తున్నాయి. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు ప్రభుత్వం అని ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుండగా వ్యవసాయాధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటం ఏమిటని పలువురు రైతులు వాపోతున్నారు.


మెండోరాలో వైరస్ సోకడంతో ఆకులు రాలిపోయిన సోయా పంట


మెండోర రైతు వేదిక

వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు లేకుంటే ఎలా..

- మగ్గిడి సాయరెడ్డి, రైతు మెండోర



రైతులు పండించిన పంటలకు వైరస్ సోకిన, ఏమైనా సమస్యలు వచ్చిన కానీ అందుబాటులో వ్యవసాయ అధికారులు లేకుంటే రైతులకు సలహాలు, సూచనలు ఎవరు ఇవ్వాలి. సోయా పంటకు ఎప్పుడూ లేని విధంగా కొత్త వైరస్ రావడతో సోయా పంట ఆకులు రాలిపోతున్నాయి. పంట మధ్యలో అక్కడక్కడ ఆకు ఎర్రగా అవుతుంది. సోయా పంట మొదటి దశలో నల్ల ఆకుపచ్చ రంగులో ఉండాల్సిన పంట ఎర్రగా ఉంది. సలహాలు, సూచనలు ఇవాల్సిన అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి వైరస్ సోకిన పంటలకు సలహాలు, సూచనలు ఇవ్వాలి.

నవనాథ సిద్దుల గుట్ట శివాలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్ , జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై శివాలయంలో సోమవారం అన్నపూర్ణ మాత, శివ లింగానికి రంగురంగుల గాజులతో అలంకరించారు. భక్తులు బిల్వ పత్రాలు, పంచా మృతాలతో అభిషేకం చేశారు. రామాలయం ముందు గల ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళ భక్తులకు ఆలయ కమిటీ వారు గాజులను పంపిణీ చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు, ఆర్మూర్ భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తు పాటలు పాడారు. ఇక్కపై వీచేసిన భక్తులు ఆలయ కమిటీ వారు అందించే అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, ప్రశాంత్ గౌడ్, హజారీ సతీష్, అలిశెట్టి నరేష్, ఆలయ అర్చకులు కుమార శర్మ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


అన్నపూర్ణమాత, శివ లింగానికి గాజులతో అలంకరించిన దృశ్యం

'ఆంధ్రజ్యోతి' పరిశీలన


ఇందల్వాయి ఎంపీడీవో కార్యాలయం


ప్రభుత్వ స్థలం


తహశీల్దార్ కార్యాలయం

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

● ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేక ఇక్కట్లు ● ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు

ఇందల్వాయి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొన్ని నూతన జిల్లాలు, నూతన మండలాలు ఏర్పడ్డాయి. అందులో భాగంగానే ఇందల్వాయి మండలం నూతనంగా ఏర్పడింది. నూతన మండలం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ప్రస్తుతం అద్దె భవనాల్లో తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, రిసోర్స్ భవనం, ఇందిరాక్రాంతి భవనం, పోలీస్ స్టేషన్ లాంటి ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతు న్నాయి. ప్రభుత్వం సరైన సమయానికి అద్దె బిల్లులు చెల్లించకపోవడం తో ఇంటి యజమానులు ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసిన సందర్భాలు ఉన్నాయి. అద్దె బిల్లు ఎక్కువ కావడంతో కొన్ని నెలల క్రితం తహశీల్దార్ కార్యాలయాన్ని ఇంకో చోటికి మార్చారు.

తహసీల్దార్ కార్యాలయం..

ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం ఇందల్వాయి ప్రాథమిక సహకార సంఘం మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్నారు. తహశీల్దార్ కార్యాలయం మార్చి నెలలు గడుస్తున్నా గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. సొసైటీ మొదటి అంతస్తులో తహశీల్దార్ కార్యాలయం నిర్వహించడంతో వివిధ పనుల కోసం వస్తున్న వృద్ధులు, వికలాంగులు మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు.

● మండల పరిషత్ కార్యాలయం..

మండల పరిషత్ కార్యాలయం బస్టాండ్ నుంచి ఒక కిలోమీటరు దూరంలో అద్దె భవనంలో ఉండటంతో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు కిలోమీటరు దూరం సైతం కాలినడకన నడవాల్సి వస్తుంది. పిల్లలు, వృద్ధులు, వికలాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ కేసుల కోసం, వ్యక్తిగత సమస్యల కోసం, భూతగాదాల సమస్యల కోసం చెప్పుకోవడానికి వస్తున్న మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో ఊరు చివరన అద్దె భవనంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో ప్రజలు నానా అవస్తలు పడుతున్నారు. ఇందిరా క్రాంతి భవనం, మండల రిసోర్స్ భవనాన్ని అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నిధుల లేమితో నూతన భవనాలు నిర్మించడం లేదు.

● స్థలం ఉన్నా నిధులు సున్నా

మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి సర్వే నెంబర్ 787 అసైన్డ్ భూమిని కేటాయించారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అనువైన స్థలం ఉన్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అద్దె భవనాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● నూతన భవనాలు నిర్మించాలి..

బడుగు రాజు, తిర్మన్‌పల్లి



ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ నిధులు లేక ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించడం లేదు. మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల పైన ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు.

● ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుంది..

షేక్ హైమద్, తిర్మన్‌పల్లి



సర్వే నెంబర్ 787లో ఏడు ఎకరాల అసైన్డ్‌భూమి ఉంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రభుత్వ స్థలం కబ్జాలకు గురవుతుంది. అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాలి.

షూటింగ్‌లో బంగారు పతకం సాధించిన విద్యార్థి రుషికేశ్


ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

రుద్రూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబం(ఆర్) గ్రామ ఆదర్శ పాఠశాల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో భాగంగా పాఠశాల నుంచి 10మంది విద్యార్థులు జానకంపేటలో నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థి రుషికేష్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్ప, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.



పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

పెద్దకొడప్‌గల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి పర్యటన ఉండటంతో బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేశారు. ఈ సందర్భంగా మండల బీజేవైఎం అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రుల పర్యటన ఉంటే బీజేవైఎం నాయకులను అరెస్ట్‌లు చేసే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిదని ఎద్దేవా చేశారు. జుక్కల్ నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనుల నిమిత్తం వచ్చే మంత్రులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం కార్యదర్శి నవీన్‌గౌడ్, బీజేపీ నాయకులు తానాజీ పాల్గొన్నారు.

బిచ్కుంద: మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇందులో కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విష్ణు, జాదవ్ పండరి, మల్లుదేశాయ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో నిర్మించతలపెట్టిన రామాలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆలయ నిర్మాణానికి మండలకేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పురం రాజమౌళి దంపతులు రూ.51వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీడీసీ, ఆలయ కమిటీ, గ్రామస్థులు, దాతల సహకారంతో రామాలయాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. అనంతరం దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ భూంరెడ్డి, వీడీసీ చైర్మన్ సూర్యకాంత్‌రెడ్డి, మాజీ వీడీసీ చైర్మన్ తక్కళ్ల నర్సారెడ్డి, నాగర్తి చంద్రారెడ్డి, సందుగారి రవీందర్‌రెడ్డి, మామిడి శ్రీనివాస్‌రెడ్డి, యాస గంగారెడ్డి, పెద్దోల్ల రాజిరెడ్డి, శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు ఇప్పించాలని వినతి

రాజంపేట, జూలై7 (ఆంధ్రజ్యోతి): తమకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, తమ జీతాలు ఇప్పించాలని కోరుతూ సోమవారం పంచాయతీ కార్మికులు డీపీఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీలలో పనులుచేస్తున్న సిబ్బందికి మూడు నెలల జీతాలు లేవని కుటుంబ పోషణ భారంగా ఉందని ఉదయం నుండి రాత్రి వరకు గ్రామ పంచాయతీలలో పనులుచేస్తున్నామని జీతంపైనే కుటుంబం నడుస్తుందని తెలిపారు. జిల్లా, మండల అధికారులు స్పందించి మూడు నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భద్రప్ప,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మహిళా సంఘ సభ్యులు

దోమకొండ, జూలై7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో బాగంగా మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వ ఆరు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో బాగంగా ప్రతిఒక్కరు బాధ్యతగా మొక్కల నాటాలన్నారు. కార్యక్రమంలో సీసీ ప్రవీణ్, సీఏ రాజు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వినతి

భిక్కనూరు, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కుమ్మరిగల్లిలో వీధి దీపాలను ఏర్పాటు చయాలని కోరుతూ భిక్కనూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణీ కార్యక్రమంలో సమాచార హక్కుచట్టం ప్రతినిధి గంగల రవీందర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా కుమ్మరిగల్లిలో వీధి దీపాలు లేక కాలనీప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి కుమ్మగల్లిలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కామారెడ్డిరూరల్, జూలై7: ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఉపాధ్యక్షులు ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ మోడీ కార్మికులకు సమ్మెహక్కు కూడా లేకుండా చేశారన్నారు. అదాని, అంబానీలకు సర్వం దారా దత్తం చేసి కార్మికులను బలి పశువు లు చేశారన్నారు. ప్రస్తుతం కార్మిక వర్గం ఐక్యమై పోరాడితే తప్ప తమ హక్కులను కాపాడుకోలేమన్నారు. కార్యక్రమంలో జిల్లానాయకులు అనీష్, కిషోర్ తదితరులున్నారు.

లైంగిక వేధింపులు, బాల్యవివాహాలను అరికట్టాలి

తాడ్వాయి, జూలై7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పెరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్యవివాహాలను అరికట్టాలని తాడ్వాయి ఎంఈఓ రామస్వామి తెలిపారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కృష్ణాజివాడి ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల సంరక్షణ పైన ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జిల్లా బాలల సంరక్షణ ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బాల సంరక్షణ పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. సమాజంలో పెరుగుతున్న మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాల వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను దత్తత తీసుకొని వారిని సంరక్షణగా చూసుకునే బాధ్యతలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీపీయూ కోఆర్డినేటర్ స్వరూప, వీణ స్రవంతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎవరికి అన్యాయం జరిగినా సహించం: మాజీ ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): అన్యాయం ఎవరికి జరిగినా సహించబోమని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు, దళిత నేత పెద్దడ్ల నర్సింలు ఇటీవల నూతనంగా నిర్మిస్తున్న గృహాన్ని రోడ్డు ఆక్రమించాడని పోలీసుబందోబస్తుతో కూల్చిన ఘటన అందరికి తెలిసిందే. ఇందులో బాగంగా సోమవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎన్నో అక్రమకట్టడాలు ఉన్నా ఒక దళితజాతికి చెందిన నర్సింలు రాజకీయంగా ఎదుగదలను చూసి ఓర్వలేకనే అధికారపార్టీ ఎమ్మెల్యే, వారి అనుచరుల ఒత్తిడితో ప్రభుత్వ అధికారులు అక్రమంగా ఆయన గృహాన్ని కూల్చివేశారని ఆరోపించారు. నర్సింలు కుటుంబానికి రూ.61వేల ఆర్థికసహాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆదిమూలాం సతీస్, విండో చైర్మన్ ఏగుల నర్సింలు, పటేల్ సాయిలు, డీసీసీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిల్ ఎరుకల సాయిలు, భూమిగారి రాములు, కామారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగం సురేందర్, శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాజంపేట: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని గుండారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసరి సిద్ధయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సిద్దయ్య చనిపోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో జెండావిష్కరిస్తున్న నాయకులు



పెద్దకొడప్‌గల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలవేస్తూ..

కామారెడ్డిరూరల్, జూలై7: జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్రఉపాధ్యక్షుడు బాగయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులైన మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో పోరాటం చేశారన్నారు. మాదిగలు చదువుతోపాటు రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో చిట్యాల సాయన్న, కొత్తూరు గంగయ్య, రవి, మధు, అశోక్, ఈశ్వర్, షైనయ్య, ఎం.డి. షాకోట్ పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని పరిధిపేట్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకటరాములు ఎగురవేశారు. అలాగే మందకృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవల లక్ష్మణ్, ప్రతినిధులు ముకల భూమయ్య, మేకల రాజు, మల్లేష్, కొంగల భూమేష్, నవీన్, సాకలి గంగయ్య, నరేష్ అనీల్, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రామారెడ్డి మండలకేంద్రం, ఉప్పల్వాయి, కన్నాపూర్ గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేశారు. కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ కార్యదర్శి కోతోల్ల యాదగిరి మాదిగ జెండా ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాజీ కొత్తల గంగారాం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, రైతుబంధు గ్రామ కమిటీ అధ్యక్షుడు కాల హనుమాన్‌లు, వీడీసీ అధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ వీసీడీ అధ్యక్షుడు లింగం, అధ్యక్షుడు ఆకుల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: లింగంపేట మండల కేంద్రం సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు నెల్లూరి గంగారాం జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఎంఆర్‌పీఎస్ నాయకులు

కామారెడ్డిరూరల్: కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జీ మంథని సామ్యేల్ కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కొత్తేల్ల యాదగిరి, సాయిలు, సట్టిగారి లక్ష్మీ, లావణ్య, పద్మ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహానికి మండల అధ్యక్షుడు సర్వగల్ల రవీందర్ పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. ఎస్సీ రిజర్వేషన్ అంశానికి తమ సహ కారం అందించిన రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావ్‌కు తమ జాతి రుణపడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ పిట్లం మండల అధ్యక్షులు మహిపాల్, నాయకులు పాపయ్య, హన్మండ్లు, సాయిలు, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.



పరిధిపేట్‌లో జెండా ఎగురవేస్తూ..



లింగంపేటలో ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వివరాలు సేకరిస్తున్న అధికారులు

నిజాంసాగర్, జూలై7 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి గ్రామాన్ని వైద్యఆరోగ్య శాఖ అధికారులు పరిశీలించారు. డెంగ్యూ నిర్ధారణ అయిన వ్యక్తి ఇంటి పరిసరాలు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఇంటి చుట్టూ పరిశీలించి లార్వా మం దును పిచికారీ చేయించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలని సబ్‌యూనిట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు. గ్రామంలో నిల్వ ఉండే నీటి గుంటలను వాటర్ ట్యాంకులను ఎప్ప టికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట నిజాంసాగర్ వైద్యా సిబ్బంది తదితరులున్నారు.

ఈ- ఆరోగ్యంలో మొదటిస్థానంలో జిల్లా

కామారెడ్డిటౌన్, జూలై7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఈ-ఆరోగ్యం ఆన్‌లైన్ అప్లికేషన్ నమోదులో జూన్‌లో జిల్లా మొదటిస్థానంలో నిలిచిందని డీయంహెచ్‌వో చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 22 ఆసుపత్రిలలో చికిత్స నిమిత్తం 25,152 మంది రాగా, 21,539 రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారని, 5,232 మంది మందులు తీసుకున్నారని పేర్కొన్నారు. సగటున రోజుకు 1007 మంది ప్రజలు సేవలు పొందుతున్నారని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

నసురుల్లాబాద్, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాజీపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సుమన్, వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ గోపాల్, ఆయిల్ పామ్, మేనేజర్ విక్రమ్, రైతులున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

గాంధారి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఎఫ్ఆర్ఓ హిమచందన మాట్లాడుతూ అడవులను రక్షించాల్సిన బాధ్యత మనఅందరిపై ఉందన్నారు. సహజ వనరులను సంరక్షించడం, కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లాంటి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌గౌడ్, రాజపండిత్, మల్లేష్, శంకర్‌గౌడ్, బాల్‌రెడ్డి, శరణ్య, శ్రీదేవి, వనజ పాల్గొన్నారు.

గురురాఘవేంద్ర కాలనీలో చోరీ

కామారెడ్డిటౌన్, జూలై7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గురురాఘవేంద్రకాలనీలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపారు. గురురాఘవేంద్రకాలనీలో దేవరాజు ఆదివారం ఇంటికి తాళం వేసి ఫంక్షన్‌కు వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడం చూసి లోపలికి వెళ్లిచూడగా బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోని 8 తులాల బంగారంతోపాటు నగదు సైతం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసుకుని విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

గ్రామాల్లో ఘనంగా పీర్ల పండుగ



బాన్సువాడ పట్టణంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



బీర్కూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ ప్రజలు సోమవారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. పాత బాన్సువాడ నుంచి కొత్త బాన్సువాడ వరకు పీర్లను ఊరేగించారు. గాజుల గుండం కింద నుంచి తిరుగుతూ తమ మొక్కులు చెల్లించుకున్నారు.

బీర్కూర్: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని కుల మతాలకు అతీతంగా ప్రజలు గ్రామాల్లో పీర్ల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య పీర్లను ఊరేగించారు. సాయంత్రం ఆల్వా ఆటలు, 'అసైదుల హారతి' పాటలు పాడుతూ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు.

లెండి, నాగమడుగు ప్రాజెక్ట్‌లను పూర్తిచేస్తాం

(5వ పేజీ తరువాయి)

తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. గత పదేండ్లుగా కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల పాల్జేసిందని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ నెలకు రూ.6వేల కోట్లు వడ్డీ చెల్లిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెలకు రోడ్లు వేయలేదు కానీ కేసీఆర్ తన ఫాంహౌస్ చుట్టు రూ.750 కోట్లతో 4లైన్ల రోడ్డు వేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇస్తే పదేళ్ల కేసీఆర్ పాలనలో కేటీఆర్, హరీశ్‌రావు, కవితలు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబానికి తప్ప పేదలకు మేలు జరగలేదన్నారు. ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 5లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇండ్లను పేదలకు ఇచ్చిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాదిన్నరలోనే 60వేల ఉద్యోగాలను భర్తీచేసిందని చెప్పారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జునప్పశెట్కార్,విఠల్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభించిన మంత్రి

పిట్లం: మండలంలోని తిమ్మానగర్ గ్రామశివారులో నూతనంగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని సోమవారం రాష్ట్రరోడ్లు, భవనాలు, సినిమా ఫొటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి ప్రారంభించారు. పిట్లం మండలానికి వచ్చిన మంత్రిని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తిమ్మానగర్ గ్రామంలో నూతనంగా రూ.4.86 కోట్లతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, జాయింట్ కలెక్టర్‌విక్టర్, కాంగ్రెస్ నాయకులున్నారు.

దత్తురెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

సీనియర్ జర్నలిస్ట్ జీడిపల్లి దత్తురెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అన్నిరకాల సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. మండలంలోని మద్దెల్‌చెరు గ్రామానికి చెందిన దత్తురెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించగా బాధిత కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. దత్తురెడ్డి భార్య ప్రియాంకకు ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని హామీఇచ్చారు. అనంతరం రూ.4లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. మంత్రివెంట ఎంపీ సురేష్‌శెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపండి: మంత్రి

జుక్కల్: జుక్కల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఉన్నతాధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బిచ్కుందలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, కెనాళ్ల పూడికతీత పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కార్యకర్తతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గ్రామస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకోవాలి

● పెద్దతడగ్గూర్ కార్యకర్తతో మాట్లాడుతున్న మంత్రి

మద్నూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. జుక్కల్ నియోజకవర్గంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలతో పాటు శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరైన ఆయన మద్నూర్ మండలం పెద్దతడుగూరు నుంచి హాజరైన గ్రామ అధ్యక్షులు ఈరన్నతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసమే పనిచేస్తుందని. ఈ విషయం గ్రామీణ ప్రాంతాలలో ఎలా ఉంటుందని మంత్రి తనను అడిగినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరేలా మీరందరూ కలిసి కృషి చేయాలని సూచించారని తెలిపారు. మంత్రితోపాటు జుక్కల్ శాసన సభ్యులు తోట లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు

(5వ పేజీ తరువాయి)

నిజామాబాద్ పట్టణాల తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. ఈ నీటిని మూడురోజులపాటు 0.35 టీఎంసీల నీటిని విడుదల చేస్తామన్న నీటిపారుదల శాఖ అధికారులు ప్రధాన కాలవెంటక్రమేపాన నీటిని వదులుతూ ఇప్పటివరకు 1.5 టీఎంసీల వదిలారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టు 1405 అడుగులు గాను 1391.68 అడుగులు 17.802 టీఎంసీలకు గాను 4.814 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాల్లేక వరద రావడం లేదు. సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నాయి. ఒప్పందం ప్రకారం నిజాంసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేయాల్సి ఉంది. ఆ నీటి కోసం ఉభయ జిల్లాల రైతులు ఎదురుచూస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు పూర్వవైభోగం తేవాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు ద్వారా నిజాంసాగర్‌లోకి ఒకే ఒకసారి 0.5 టీఎంసీల నీరు మాత్రమే వచ్చింది. వర్షాలు సకాలంలో కురిస్తే తప్ప ఆయకట్టు నీరందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ సిబ్బంది

నాగిరెడ్డిపేట, జూలై7 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగంగా మండలంలోని అచ్చయపల్లి గ్రామంలో సోమవారం ఎల్లారెడ్డి ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. 2025-26 వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కలు నాటేందుకు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సిబ్బంది అచ్చయపల్లి గ్రామాన్ని ఎంపీక చేసుకుని గ్రామస్తులతో కలిసి గ్రామంలో రోడ్డు పక్కన ఈత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వెంకట్ రాములు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

లింగంపేట, జూలై7 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలోని పెద్ద వాగు సమీపంలో సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలపై ఉన్న పేండింగ్ చాలన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, హెల్మెట్ లేకుండా వాహనాలను నడపడం, ఓవర్‌లోడ్ వాహనాలను జరిమానాలు వేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ ఉన్నారు.

'ఆలయ్ బలయ్' కరపత్రాల ఆవిష్కరణ

కామారెడ్డి రూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్ అతిథి గృహంలో భారత రాజ్యాంగ పరిరక్షణలో బహుజన ఆలయ్ బలయ్ కరపత్రాలను ఆల్ ఇండియ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 27న కామారెడ్డి కళభారతిలో భారత రాజ్యంగ పరిరక్షణలో బహుజన ఆలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి యువకుల అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు రాజ్‌కుమార్, బాల్‌రాజు, శ్రీశైలం, రాజు, రవితేజ, రాజశేఖర్, సాయితేజ, మనోజ్, శ్రీకాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.